క్లుప్తంగా

పద్యాల పోటీలు



నెల్లూరు (టౌన్): మాతృభాషా దినోత్సవాన్ని పురస్కరించుకుని కొండాయపాళెం దళితవాడ మున్సిపల్ ప్రాథమిక పాఠశాలలోని విద్యార్థులకు బుధవారం పద్యాల పోటీలు నిర్వహించారు. ఐదో తరగతి విద్యార్థిని శృతి 30 పద్యాలు చెప్పి ప్రథమ స్థానంలో నిలవగా, సంజన, కుసుమప్రియ ద్వితీయ, తృతీయ స్థానాల్లో నిలిచారు. విజేతలకు బహుమతులు ప్రదానం చేశారు. ఈ కార్యక్రమంలో హెచ్‌ఎం భాస్కరరావు, ఉపాధ్యాయులు హరీష్, రాశి, తదితరులు పాల్గొన్నారు.

ఓటరు నమోదుపై అవగాహన



నెల్లూరు (టౌన్): స్థానిక ఆదిత్య డిగ్రీ కళాశాలలో ఎన్‌ఎస్‌ఎస్ విభాగం ఆధ్వర్యంలో ఓటరు నమోదు, ఓటు వినియోగంపై విద్యార్థులకు బుధవారం అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా కళాశాల ప్రిన్సిపల్ పుల్లయ్య మాట్లాడుతూ ఎన్నికల సంఘం 18 ఏళ్లు నిండిన పౌరులందరికీ ఆన్‌లైన్, ఆఫ్‌లైన్ ద్వారా ఓటరుగా నమోదు చేసుకునే అవకాశం కల్పిస్తుందన్నారు. ఓటు హక్కు లేని విద్యార్థులు నేషనల్ ఓటర్స్ సర్వీసు పోర్టల్‌లో ఫారం–6 ద్వారా దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. ఎన్‌ఎస్‌ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్ వర్మ, శివ, బీఎల్వో సూపర్‌వైజర్ అబ్దుల్‌రహీం, శ్రీనివాసులు, విజయ, బిందుమాధవి, ప్రసాద్, శివకుమార్ తదితరులు పాల్గొన్నారు.

డీఈఓకు సన్మానం



నెల్లూరు రూరల్: నగరంలోని జిల్లా విద్యాశాఖ కార్యాలయంలో డీఈఓ రామారావును ఎస్సీ ఎస్టీ ఎంప్లాయీస్ అసోసియేషన్ నాయకులు బుధవారం మర్యాదపూర్వకంగా కలిసి సత్కరించారు. జిల్లాలో విద్యారంగ అభివృద్ధికి సహకరించాలని అసోసియేషన్ నాయకులు కోరారు. నాయకులు బాబ్జి, కృష్ణయ్య, ప్రభాకర్ తదితరులు పాల్గొన్నారు.

ఐసీఎంఏ ఫలితాల్లో 'జెనెక్స్' విద్యార్థుల హవా



నెల్లూరు (టౌన్): ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ కాస్ట్ అకౌంటెంట్స్ ఆఫ్ ఇండియా (ఐసీఎంఏ) ఫలితాల్లో జెనెక్స్ విజన్ అకాడమీ విద్యార్థులు ఆల్ ఇండియా స్థాయిలో ప్రభంజనం సృష్టించారని ఆ అకాడమీ డైరెక్టర్లు వెంగళ్‌రెడ్డి, కొండలరావు తెలిపారు. హరనాథపురంలోని జెనెక్స్ విజన్ అకాడమీలో ఆల్ ఇండియా స్థాయిలో ర్యాంకులు సాధించిన విద్యార్థులను బుధవారం వారు అభినందించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సీఎంఏ ఫైనల్ ఫలితాల్లో విష్ణుప్రణీత్ 504 మార్కులతో 15వ ర్యాంకు, చిన్ననారాయణమ్మ 467 మార్కులతో 41వ ర్యాంకు, ఎస్‌కే కౌసర్ 462 మార్కులతో 46వ ర్యాంకు, ఎం చంద్రకుమార్ 457 మార్కులతో 48వ ర్యాంకు సాధించారని తెలిపారు. సీఎంఏ ఇంటర్ ఫలితాల్లో జాన్‌జయకుమార్ 586 మార్కులతో 5వ ర్యాంకు, ఎస్‌కే మెహవిష్ 550 మార్కులతో 19వ ర్యాంకు, శ్రావణి 547 మార్కులతో 22వ ర్యాంకు, శ్రీనివాసన్ ఉదయన్ 527 మార్కులతో 32వ ర్యాంకు, పావని 442 మార్కులతో 39వ ర్యాంకు, షెర్లీ 511 మార్కులతో 44వ ర్యాంకు సాధించారని వివరించారు.

నేడు వ్యక్తిత్వ వికాసంపై శిక్షణ

నెల్లూరు(బృందావనం): జీవితంలో ఉన్నతంగా ఎదిగి వివిధ రంగాల్లో రాణించాలనే లక్ష్యం ఉన్న వారి కోసం జీఎమ్మార్ రియల్ ఎస్టేట్స్ ఆధ్వర్యంలో గురువారం వ్యక్తిత్వ వికాసంపై శిక్షణా కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు ఆ ఎస్టేట్స్ డైరెక్టర్ జెల్లా ఉమాపతి బుధవారం తెలిపారు. ముత్తుకూరురోడ్డులోని శ్రీవరిగొండ జ్వాలాముఖి అమ్మవారి ఆలయానికి అత్యంత సమీపంలో ఉన్న మెగా గేటెడ్ కమ్యూనిటీ వెంచర్ శ్రీబాలాజీ గ్రీన్‌సిటీలో సాయంత్రం 5గంటలకు జరిగే కార్యక్రమానికి ప్రముఖ వ్యక్తిత్వ వికాస నిపుణులు డాక్టర్ మేధ చిరంజీవి హాజరై వ్యక్తిత్వ వికాసంపై శిక్షణ ఇస్తారని చెప్పారు. జిల్లాలోని నిరుద్యోగ యువత అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. వివరాలకు 90109 24999, 63057 83051 నంబర్లలో సంప్రదించాలని సూచించారు.

వలంటీర్ల సేవలు అభినందనీయం



పురస్కారాలు అందుకున్న వలంటీర్లతో ఎమ్మెల్సీ చంద్రశేఖరరెడ్డి, సమన్వయకర్త ఖలీల్‌అహ్మద్

నెల్లూరు (స్టోన్‌హౌస్‌పేట): వలంటీర్ల సేవలు అభినందనీయమని ఎమ్మెల్సీ చంద్రశేఖర్‌రెడ్డి పేర్కొన్నారు. నగరంలోని విజయమహల్‌గేటు సమీపంలోని ఎంసీఎస్ కల్యాణ మండపంలో వలంటీర్లకు వందనం కార్యక్రమాన్ని బుధవారం నిర్వహించారు. నగర నియోజకవర్గ పరిధిలోని 3,4,5,6, 7,8,9,10,11,13,14,15,16,45 డివిజన్లకు చెందిన వలంటీర్లకు సేవామిత్ర, సేవారత్న, సేవావజ్ర పురస్కారాలను ప్రదానం చేసి ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో నగర నియోజకవర్గ వైఎస్సార్‌సీపీ ఇన్‌చార్జి ఖలీల్‌అహ్మద్‌తో పాటు ఎమ్మెల్సీ చంద్రశేఖర్‌రెడ్డి పాల్గొని మాట్లాడారు. ప్రజలకు ప్రభుత్వ సేవలను చేరువ చేయడంతో పాటు అర్హులందరికీ సంక్షేమ పథకాలను అందించే లక్ష్యంతో సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి వార్డు సచివాలయ, వలంటీర్ వ్యవస్థలను ఏర్పాటు చేశారన్నారు. ప్రభుత్వ లక్ష్యానికి అనుగుణంగా సచివాలయ, వలంటీర్ వ్యవస్థలు పనిచేస్తూ దేశానికే ఆదర్శంగా నిలిచాయన్నారు. గత టీడీపీ ప్రభుత్వంలో జన్మభూమి కమిటీలు ఇష్టానుసారంగా వ్యవహరించిన తీరును అందరూ చూశారన్నారు. అందుకు భిన్నంగా కుల,మత, రాజకీయాలతో సంబంధం లేకుండా ప్రజలకు సేవ చేస్తున్న వలంటీర్లను ప్రభుత్వం ఏడాదికి ఒకసారి సన్మానించి పురస్కారాలను ప్రదానం చేస్తోందని తెలిపారు. ఎన్నికల సమయంలో హామీలు గుప్పించి అధికారంలోకి వచ్చాక నెరవర్చకుండా ప్రజలను మోసం చేయడంలో చంద్రబాబు దిట్టన్నారు. గత ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి నూరు శాతం నెరవేర్చారని తెలిపారు. జగనన్న సామాన్య వ్యక్తి అయిన ఎండీ ఖలీల్ అహ్మద్‌ను వైఎస్సార్‌సీపీ నగర సమన్వయకర్తగా నియమించడం గొప్ప విషయమని, రానున్న ఎన్నికల్లో నగర ప్రజలు ఖలీల్‌అహ్మద్‌ను ఆశీర్వదించాలని చంద్రశేఖర్‌రెడ్డి కోరారు. ఈ కార్యక్రమంలో కార్పొరేటర్లు సంక్రాంతి అశ్విని, పోలంరెడ్డి లక్ష్మీప్రత్యూష, ఓబిలి రవిచంద్ర, మద్దినేని మస్తానమ్మ, మెగ్గళ్లపల్లి కామాక్షీదేవి, దామవరపు రాజశేఖర్, కిన్నెర ప్రేమ్‌కుమార్, గోతం అరుణ, ఊటుకూరు నాగార్జున, కర్తం ప్రతాప్‌రెడ్డి, గణేశం సుజాత, వేనాటి శ్రీకాంత్‌రెడ్డి, ముదిరెడ్డి వేదవతి, 7వ డివిజన్ ఇన్‌చార్జి కిన్నెర ప్రసాద్, నాయకులు దొంతాల రఘు, వంగాల శ్రీనివాసులరెడ్డి, నేతాజీ సుబ్బారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

నూతన విద్యుత్ సెక్షన్ కార్యాలయం ఏర్పాటు



నూతనంగా నిర్మించిన వెంకటేశ్వరపురం విద్యుత్ సెక్షన్ కార్యాలయం

నెల్లూరు(వీఆర్సీసెంటర్): నగర పరిధిలో నూతనంగా మరో విద్యుత్ సెక్షన్ కార్యాలయాన్ని ఏర్పాటు చేయాలని ఏపీఎస్పీడీసీఎల్ సీఎండీ హరనాథరావు బుధవారం ఉత్తర్వులు జారీ చేశారు. ఇప్పటి వరకు నగర పరిధిలో ఉన్న 11 విద్యుత్ సెక్షన్ కార్యాలయాలకు తోడు నూతనంగా వెంకటేశ్వరపురం సెక్షన్ కార్యాలయాన్ని ఏర్పాటు చేయనున్నారు. ఈ కార్యాలయం పరిధిలో అల్లీపురంలోని టిడ్కో గృహ సముదాయంలో నిర్మించిన సబ్‌స్టేషన్, భగత్‌సింగ్ కాలనీలోని జగనన్న కాలనీలో నిర్మిస్తున్న విద్యుత్ సబ్‌స్టేషన్లు రానున్నాయి. ఈ సబ్‌స్టేషన్ల పరిధిలోని వెంకటేశ్వరపురం, జనార్దన్‌రెడ్డికాలనీ, గాంధీగిరిజనకాలనీ, భగత్‌సింగ్ కాలనీ, పడుగుపాడు ఇండ్రస్ట్రీయల్, అల్లీపురం టిడ్కో గృహ సముదాయం, భగత్‌సింగ్‌కాలనీలోని జగనన్నకాలనీ, తదితర ప్రాంతాల విద్యుత్ వినియోగదారులకు ఇక నుంచి వెంకటేశ్వరపురం సెక్షన్ కార్యాలయంలో కార్యకలాపాలు నిర్వహించనున్నారు. నూతన సెక్షన్ కార్యాలయంలో అసిస్టెంట్ ఇంజినీర్‌తో పాటు సిబ్బందిని నియమించనున్నారు.

కేంద్ర ప్రభుత్వ పథకాలపై అవగాహన



పోస్టర్లను ప్రదర్శిస్తున్న అధికారులు, నాయకులు

నెల్లూరు(బారకాసు): వికసిత్ భారత్ సంకల్ప యాత్రలో భాగంగా నగరంలోని డైకస్‌రోడ్డు, కొత్తూరు సెంటర్‌లో కేంద్ర ప్రభుత్వ పథకాలపై బుధవారం అవగాహన కల్పించారు. కార్పొరేషన్ ఉద్యాన శాఖ ఏడీ ప్రదీప్‌కుమార్ కేంద్ర ప్రభుత్వ పథలైన పీఎం స్వనిధి, ముద్రలోన్, బ్యాంకులు అందిస్తున్న రుణ సదుపాయాలు, తదితరాలపై అవగాహన కల్పించారు. కేంద్ర పథకాలను లబ్ధిదారులు సద్వినియోగం చేసుకుని ఆర్థికంగా ఎదగాలని కోరారు. బీజేపీ నాయకులు ఆంజనేయరెడ్డి, రాధాకృష్ణ, శ్రీనివాసులురెడ్డి, ఫీల్డ్‌ఆఫీసర్ నాగసాయిసూరి, యాత్ర కన్వీనర్లు, వివిధ బ్యాంకుల ప్రతినిధులు, కార్పొరేషన్, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

సీసీరోడ్డు నిర్మాణ పనుల పరిశీలన



పనులను పరిశీలిస్తున్న బాబ్జియాదవ్

నెల్లూరు(బారకాసు): కార్పొరేషన్ పరిధిలోని 41వ డివిజన్, దుర్గానగర్‌లో చేపడుతున్న సీసీరోడ్డు నిర్మాణ పనులను ఆ డివిజన్ ఇన్‌చార్జి కువ్వాకోలు బాబ్జియాదవ్ బుధవారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 41వ డివిజన్‌లోని సమస్యలను రూరల్ నియోజకవర్గ వైఎస్సార్‌సీపీ సమన్వయకర్త, ఎంపీ ఆదాల ప్రభాకర్‌రెడ్డి దృష్టికి తీసుకెళ్లినట్లు తెలిపారు.స్పందించిన ఆదాల డివిజన్ అభివృద్ధికి నిధులు కేటాయించి వెంటనే పనులు చేపట్టాలని కార్పొరేషన్ అధికారులకు సూచించారన్నారు. దీంతో డివిజన్‌లో పలు అభివృద్ధి పనులు చేపడుతున్నట్లు చెప్పారు. అందులో భాగంగా సీసీరోడ్డు నిర్మాణ పనులు ప్రారంభించామని వీలైనంత త్వరగా పూర్తి చేస్తామన్నారు. తాము అడిగిన వెంటనే స్పందించిన ఎంపీ ఆదాలకు డివిజన్ ప్రజలు తరఫున కృతజ్ఞతలు తెలుపుతున్నామన్నారు. పార్టీ నాయకులు వేలూరు గోపి, మలి శ్రీనివాసులు, వేణు, వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

'పెరుగు'కు మాతృభాషా దినోత్సవ పురస్కారం



పెరుగు రామకృష్ణను సన్మానిస్తున్న లక్ష్మీపార్వతి, ఆచార్య రాజశేఖర్

నెల్లూరు(బృందావనం): నెల్లూరుకు చెందిన కవి పెరుగు రామకృష్ణ మాతృభాషా దినోత్సవ పురస్కారాన్ని అందుకున్నారు. ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ అనుబంధ సంస్థ తెలుగు, సంస్కృత అకాడమీ ఆధ్వర్యంలో గుంటూరులోని ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయంలో ఆచార్య ఎల్ వేణుగోపాలరెడ్డి సమావేశ మందిరంలో అంతర్జాతీయ మాతృభాషా దినోత్సవ వేడుకలను బుధవారం ఘనంగా నిర్వహించారు ఈ సందర్భంగా పెరుగు రామకృష్ణను తెలుగు, సంస్కృత అకాడమీ అధ్యక్షురాలు నందమూరి లక్ష్మీపార్వతి, ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయం ఉపకులపతి ఆచార్య పీ రాజశేఖర్ పురస్కారాన్ని అందజేసి సత్కరించారు. పురస్కార గ్రహీత రామకృష్ణకు అభ్యుదయ రచయితల సంఘం (అరసం) నిర్వాహకులు అభినందనలు తెలిపారు.

విలేజ్ క్లినిక్స్‌కు విద్యుత్ అందించాలి



ఈఈలతో సమీక్షిస్తున్న చీఫ్ జనరల్ మేనేజర్ గురవయ్య

నెల్లూరు(వీఆర్సీసెంటర్): జగనన్న కాలనీల్లో త్వరలో ఏర్పాటు చేయనున్న విలేజ్ క్లినిక్స్‌కు విద్యుత్ సరఫరా అందించే ప్రక్రియను యుద్ధ ప్రాతిపదికన పూర్తిచేయాలని ఏపీఎస్పీడీసీఎల్ చీఫ్ జనరల్ మేనేజర్ (మెయిన్‌టెనెన్స్) కే గురవయ్య జిల్లా విద్యుత్ అధికారులను ఆదేశించారు. బుధవారం నెల్లూరుకు వచ్చిన ఆయన విద్యుత్ భవన్‌లో జిల్లాకు చెందిన ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్లతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లాలోని కొన్నిచోట్ల పగటిపూట వీధి దీపాలు వెలుగుతున్నాయన్నారు. వాటిని విద్యుత్ సెక్షన్ ఆఫీసర్లు గుర్తించి సరిచేసి ఈ నెల 29లోగా నివేదికలను అందజేయాలన్నారు. జిల్లాలోని 33 కేవీ, 11 కేవీ ఫీడర్లలో ఓవర్‌లోడ్‌ను గుర్తించి సరిచేయాలని, అవసరమైన చోట నూతనంగా విద్యుత్ ఫీడర్ల ఏర్పాటుకు అంచనాలు సిద్ధం చేసి పంపాలని ఆదేశించారు. జిల్లాలోని కొన్ని సెక్షన్ల పరిధిలో జీఐఎస్ సర్వే ఇంకా పూర్తి కాలేదని, వెంటనే పూర్తిచేయాలని సూచించారు. ఈ సమావేశంలో జిల్లా సర్కిల్ ఎస్‌ఈ విజయన్, సీనియర్ అకౌంట్స్ ఆఫీసర్ మురళి, ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్లు సోమశేఖర్‌రెడ్డి, విజయకుమార్‌రెడ్డి, ప్రసన్నకుమార్, బెనర్జీ, జనార్దన్, పరంధామయ్య, నరేంద్రరెడ్డి, డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్లు సురేష్‌బాబు, అశోక్, భానునాయక్, తదితరులు పాల్గొన్నారు.

లైన్‌మెన్ సస్పెన్షన్

నెల్లూరు(వీఆర్సీసెంటర్): నగరంలోని వెంకటేశ్వరపురం విద్యుత్ సబ్‌స్టేషన్ పరిధిలో విధులు నిర్వహిస్తున్న లైన్‌మెన్ మేకల మల్లికార్జునరావును సస్పెండ్ చేస్తూ విద్యుత్ శాఖ నెల్లూరు టౌన్ ఈఈ సోమశేఖర్‌రెడ్డి బుధవారం ఆదేశాలు జారీ చేశారు. లైన్‌మెన్ విధి నిర్వహణలో అలసత్వం వహించడంతో పాటు విద్యుత్ బిల్లులకు సంబంధించిన నగదును తన సొంతానికి వాడుకున్నారనే ఆరోపణలు రావడంతో విద్యుత్ శాఖ ఉన్నతాధికారులు గత నెలలో విచారణ చేపట్టారు. నివేదికను నెల్లూరు టౌన్ ఈఈకు పంపగా పరిశీలించి సదరు లైన్‌మెన్‌ను సస్పెండ్ చేశారు.

ఏడుగురు జూదరుల అరెస్ట్

నెల్లూరు(క్రైమ్): నగరంలోని జ్యోతినగర్‌లో ఓ గృహంలో గుట్టుచప్పుడు కాకుండా పేకాట నిర్వహిస్తున్నట్లు నగర డీఎస్పీ డీ శ్రీనివాసరెడ్డి, వేదాయపాళెం ఇన్‌స్పెక్టర్ పీవీ నారాయణకు సమాచారం అందింది. వారి ఆధ్వర్యంలో డీఎస్పీ ఐడీ పార్టీ సిబ్బంది మణి, సాగర్, వేదాయపాళెం పోలీసులు బుధవారం కేంద్రంపై దాడిచేశారు. పేకాట ఆడుతున్న ఏడుగురు జూదరులను అరెస్ట్ చేశారు. వారి వద్ద నుంచి రూ.63 వేల నగదు, సెల్‌ఫోన్లను స్వాధీనం చేసుకుని పోలీసుస్టేషన్‌కు తరలించారు.

నర్సింగ్ విద్యార్థిని అదృశ్యం

నెల్లూరు(క్రైమ్): శిక్షణ నిమిత్తం ఆస్పత్రికి వెళ్లిన నర్సింగ్ విద్యార్థిని అదృశ్యమైన ఘటనపై సంతపేట పోలీసులు బుధవారం కేసు నమోదు చేశారు.వివరాలు..తిరుపతి జిల్లా వాకాడుకు చెందిన యువతి నెల్లూరు తల్పగిరి కాలనీలోని నర్సింగ్ స్కూల్‌లో జీఎన్‌ఎం కోర్సు చదువుతోంది. ఈ నెల 20న ఆమె శిక్షణ నిమిత్తం నగరంలోని ఓ ప్రైవేట్ ఆస్పత్రికి వెళ్లింది. అక్కడి నుంచి ఆమె అదృశ్యమైంది. ఈ మేరకు నర్సింగ్ స్కూల్ యాజమాన్యం బాధిత తల్లి మస్తానమ్మకు సమాచారం అందించారు. ఆమె నెల్లూరుకు చేరుకుని కుమార్తె కోసం గాలించారు. జాడ తెలియకపోవడంతో సంతపేట పోలీసులకు బుధవారం ఫిర్యాదు చేశారు. పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

రాజరాజేశ్వరీదేవికి ఊంజల్‌సేవ రేపు

నెల్లూరు(బృందావనం): నగరంలోని శ్రీరాజరాజేశ్వరీదేవి దేవస్థానంలో శుక్రవారం సాయంత్రం 6 గంటలకు అమ్మవారికి ఊంజల్‌సేవ నిర్వహించనున్నట్లు ఆలయ ఈఓ జే వెంకటసుబ్బయ్య, వంశపారంపర్య ధర్మకర్త రత్నం జయరామ్ బుధవారం తెలిపారు. ఈ సందర్భంగా సామూహిక లలితాసహస్రనామ పారాయణం, సౌందర్యలహరి, సంగీత, వీణా వాయిద్య, నాట్య షోడశ్లపచార పూజలు నిర్వహించనున్నట్లు చెప్పారు. భక్తులు అమ్మవారిని దర్శించుకుని తీర్థప్రసాదాలు స్వీకరించాలని కోరారు.

నేడు డీఎస్సీ-2008 అభ్యర్థులు హాజరుకావాలి

నెల్లూరు (టౌన్): డీఎస్సీ–2008కు సంబంధించి గతంలో కాంట్రాక్ట్ పద్ధతిలో ఎంటీఎస్ కింద పనిచేసేందుకు సుముఖత వ్యక్తపరిచిన అభ్యర్థులు అర్హత ధ్రువపత్రాలతో గురువారం ఉదయం 10.30 గంటలకు జిల్లా విద్యాశాఖ కార్యాలయంలో హాజరుకావాలని డీఈఓ రామారావు బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. సీహెచ్ గురవయ్య, సీహెచ్ లక్ష్మీనరసన్న, ఎంవీ సుభాషిణి, ఎస్ ప్రభాకర్, ఎస్‌కే ఫరీదాభాను, కే జనార్దన్, ఎం ఇంద్రసేనమ్మ హాజరుకావాలని సూచించారు.

భర్త అదృశ్యంపై ఫిర్యాదు

బుచ్చిరెడ్డిపాళెం రూరల్: పట్టణంలోని ఆంధ్రాబ్యాంక్ వీధిలో నివాసం ఉంటున్న సీహెచ్ రాజేశ్వరి తన భర్త చార్మణయ్య కనిపించడం లేదని బుధవారం పోలీసులకు ఫిర్యాదు చేశారు. గత నెల 25న స్థానిక గ్రంథాలయంలో విధులకు హాజరైన తన భర్త చార్మణయ్య అదేరోజు నుంచి అదృశ్యమయ్యాడని ఫిర్యాదులో పేర్కొంది. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని ఎస్సై మహేంద్ర తెలిపారు.

మొండి బకాయిదారులపై చట్టప్రకారం చర్యలు



మాట్లాడుతున్న కమిషనర్ వికాస్‌మర్మత్

నెల్లూరు(బారకాసు): కార్పొరేషన్ పరిధిలో ఆస్తి, కమర్షియల్, మంచినీటి, డ్రైనేజీ పన్నులు కట్టకుండా ఉన్న మొండి బకాయిదారులను గుర్తించి మున్సిపల్ చట్టప్రకారం చర్యలు తీసుకోవాలని కమిషనర్ వికాస్‌మర్మత్ అధికారులను ఆదేశించారు. కార్పొరేషన్ కార్యాలయంలోని కమాండ్ కంట్రోల్ సెంటర్ భవనంలోని సమావేశ మందిరంలో రెవెన్యూ, ఇంజినీరింగ్ శాఖల అధికారులు, సచివాలయ అడ్మిన్, అమెనిటీ కార్యదర్శులతో బుధవారం ఆయన సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కార్పొరేషన్‌కు సంబంధించి నిర్దేశించిన పన్నుల వసూళ్ల లక్ష్యాలను సాధించాలన్నారు. నిర్దేశించిన లక్ష్యం కన్నా తక్కువ శాతం పన్నులు వసూలు చేసిన కార్యదర్శులకు షోకాజ్ నోటీసులు జారీ చేయాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. అమెనిటీస్ కార్యదర్శులు మంచినీటి పన్నుల వసూళ్ల లక్ష్యాలను సాధించాలన్నారు. అపార్ట్‌మెంట్లు, సినిమాహాళ్లు తదితర వాణిజ్య భవనాలకు సంబంధించిన పన్నుల వసూళ్ల ప్రక్రియను త్వరితగతిన పూర్తి చేయాలన్నారు. పన్నులు చెల్లించేందుకు ప్రజలు ఇబ్బందులు పడకుండా త్వరలో పలు ప్రాంతాల్లో వసూళ్ల కేంద్రాలను ఏర్పాటు చేస్తామని తెలిపారు. నగర వ్యాప్తంగా ప్రతి భవనాన్ని పన్ను పరిధిలోకి తీసుకొచ్చి డిమాండ్ నోటీస్ జారీ చేయాలని ఆదేశించారు. సచివాలయ అడ్మిన్ కార్యదర్శులకు రోజువారీ లక్ష్యాలను నిర్దేశించి కార్పొరేషన్ ఆదాయం పెంచేందుకు అధికారులంతా కృషి చేయాలన్నారు. ఈ సమావేశంలో అదనపు కమిషనర్ శర్మద, డిప్యూటీ కమిషనర్ చెన్నుడు, ఎస్‌ఈ సంపత్‌కుమార్‌తో పాటు రెవెన్యూ, ఇంజినీరింగ్ శాఖల అధికారులు పాల్గొన్నారు.

ఆధునీకరణ పనులను వేగవంతం చేయండి



అధికారులకు సూచనలు ఇస్తున్న కలెక్టర్ ఎం హరినారాయణన్

నెల్లూరు(దర్గామిట్ట): ఎన్నికలు సమీపిస్తున్నందున ఆర్‌అండ్‌బీ అతిథిగృహం, హరిత టూరిజం హోటల్ ఆధునీకరణ పనులను వేగవంతం చేయాలని కలెక్టర్ ఎం హరినారాయణన్ సంబంధిత అధికారులను ఆదేశించారు. బుధవారం ఆయన ఆర్‌అండ్‌బీ అతిథిగృహం, హరిత హోటల్‌లో జరుగుతున్న ఆధునీకరణ పనులను పరిశీలించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ రానున్న సార్వత్రిక ఎన్నికలకు సంబంధించి అబ్జర్వర్లు, ఎన్నికల సంఘం అధికారులు తరచూ వస్తుంటారన్నారు. వారికి సరైన వసతి కల్పించడం కోసం ఆధునీకరణ పనులు చేపడుతున్నామని తెలిపారు.ఆర్‌అండ్‌బీ అతిథిగృహం, హరిత హోటల్ పరిసరాలను శుభ్రంగా ఉంచాలని ఆర్‌అండ్‌బీ ఎస్‌ఈ, టూరిజం మేనేజర్‌కు సూచించారు. పనులు సక్రమంగా జరుగుతున్నాయో..లేదో పర్యవేక్షించాలని డీఎఫ్‌ఓ చంద్రశేఖర్‌కు సూచించారు. కలెక్టర్ వెంట డీఆర్వో ఎస్ లవన్న, ఎస్‌ఈ గంగాధర్, డీఎఫ్‌ఓ చంద్రశేఖర్, టూరిజం డీయం, ఆర్ అండ్ బి అధికారులు పాల్గొన్నారు.

వైఎస్సార్‌సీపీని ఆశీర్వదించండి



38వ డివిజన్‌లో ప్రచారం నిర్వహిస్తున్న లక్ష్మీసునంద, కార్పొరేటర్ అమృత



18వ డివిజన్‌లో ప్రచారం చేస్తున్న కార్పొరేటర్ అశోక్‌కుమార్

నెల్లూరు(బారకాసు): రానున్న ఎన్నికల్లో సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆశీస్సులతో వైఎస్సార్‌సీపీ తరఫున నెల్లూరు రూరల్ నియోజకవర్గ ఎమ్మెల్యే అభ్యర్థిగా పోటీ చేస్తున్న ఆదాల ప్రభాకర్‌రెడ్డిని భారీ మెజార్టీతో గెలిపించాలని ఆ పార్టీ మహిళా నాయకులు కోరారు. బుధవారం 38వ డివిజన్‌లో ప్రభుత్వ సర్వజన ఆస్పత్రి కోఆర్డినేటర్ లక్ష్మీసునంద,కార్పొరేటర్ దాసరి అమృత పలువురు మహిళా నాయకులతో కలిసి ఇంటింటి ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రాష్ట్రంలోని అన్ని వర్గాలను దృష్టిలో ఉంచుకుని సంక్షేమ పథకాలను అమలు చేసిన ఘనత సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిదేనన్నారు. పేద, మధ్య తరగతి కుటుంబాలు సంక్షేమ పథకాలతో ఆర్థికంగా ఎంతో అభివృద్ధి చెందాయన్నారు. జగనన్నను మళ్లీ సీఎంగా చేసుకునేందుకు మహిళలంతా సిద్ధంగా ఉన్నారన్నారు. పార్టీ మహిళా నాయకులు శారద, బషీరా, షెహనాజ్, ఫరీదా, మల్లిక, సంజన పాల్గొన్నారు.

- నగరంలోని 18వ డివిజన్‌లో కార్పొరేటర్ తోటకూర అశోక్‌కుమార్ ఆధ్వర్యంలో ఇంటింటి ప్రచారం నిర్వహించారు. రానున్న ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీ నుంచి నెల్లూరురూరల్ నియోజకవర్గ ఎమ్మెల్యే అభ్యర్థిగా పోటీ చేస్తున్న ఆదాల ప్రభాకర్‌రెడ్డిని అత్యధిక మెజార్టీతో గెలిపించాలని ఓటర్లను అభ్యర్థించారు. ఈ కార్యక్రమంలో డివిజన్ నాయకులు పాల్గొన్నారు.

దోమల నియంత్రణకు చర్యలు



ఆయిల్‌బాల్స్ వదులుతున్న దృశ్యం

నెల్లూరు(స్టోన్‌హౌస్‌పేట): నగరంలోని ఇస్లాంపేటలో దోమల నియంత్రణకు కార్పొరేటర్ సఫియా ముజీర్ బుధవారం చర్యలు చేపట్టారు. నగర ఎమ్మెల్యే అనిల్‌కుమార్‌యాదవ్ పర్యవేక్షణలో నగర నియోజకవర్గ వైఎస్సార్‌సీపీ సమన్వయకర్త ఖలీల్‌అహ్మద్ ఆదేశాల మేరకు దోమల నియంత్రణకు మురుగు కాలువల్లో ఆయిల్‌బాల్స్ వదిలినట్లు కార్పొరేటర్ తెలిపారు. ఈ కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ నాయకులు అస్లాం,ఫాజిల్, ఆయాజ్, ఖాదర్‌బాషా, మునీర్ తదితరులు పాల్గొన్నారు.

వడ్డెర్లకు రాజకీయ అవకాశాలు కల్పించాలి



మాట్లాడుతున్న వడ్డెర నాయకులు

నెల్లూరు(మినీబైపాస్): వడ్డెర్లకు రాజకీయంగా అవకాశాలు కల్పించాలని వడ్డెర సంక్షేమ సంఘ రాష్ట్ర నాయకులు బెల్లంకొండ చిన్నయ్య డిమాండ్ చేశారు. నగరంలోని ప్రెస్‌క్లబ్‌లో బుధవారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. రాష్ట్రంలో 30 లక్షలకుపైగా వడ్డెర ఓటర్లు ఉన్నారని తెలిపారు. జనాభా దామాషా ప్రకారం రాజకీయ పార్టీలు వడ్డెర్లకు 12 ఎమ్మెల్యే, 2 ఎంపీ స్థానాలు కేటాయించాలని కోరారు. ఈ సమావేశంలో జిల్లా అధ్యక్షుడు గుంజి గోపి, రాష్ట్ర నాయకులు బెల్లంకొండ చిన్నయ్య, గౌరవ సలహాదారు గుంజి ఖాసిం, జిల్లా అధికార ప్రతినిధి గుంజి మనోహర్ తదితరులు పాల్గొన్నారు.

న్యాయం చేయాలని విజ్ఞప్తి



నెల్లూరు(మినీబైపాస్): తాము సుమారు 70 ఏళ్లుగా సాగు చేసుకుంటున్న 1.25 సెంట్ల ప్రభుత్వ భూమిని ఇటీవల పలువురు ఆక్రమించి ఇబ్బందులకు గురిచేస్తున్నారని, ఉన్నతాధికారులు స్పందించి తమకు న్యాయం చేయాలని కనుపర్తిపాడుకు చెందిన పర్వతాల రమణయ్య కోరారు. నగరంలోని ప్రెస్‌క్లబ్ బుధవారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. తమ భూమిని కొందరు ఆక్రమించి జేసీబీతో పునాదులు తీయగా, తాను వెళ్లగా పరారయ్యారని చెప్పారు. ఈ విషయాన్ని కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లగా భూమిని మీరే సాగు చేసుకోవచ్చని చెప్పారన్నారు. అయినా దళారులు ఇబ్బందులకు గురిచేస్తున్నారని వాపోయారు. ఈ సమావేశంలో వేణు, వెంకటరమణమ్మ, అరుణ, బుజ్జమ్మ తదితరులు పాల్గొన్నారు.